క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు.అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది,అర్చనలు చేసిప్రసాద వితరణ గావించారు.

రేపు అంద్రెయ ఆలయ ప్రతిష్ఠ వేడుకలు

మిడుతూరు: స్థానిక అంద్రెయ ఆలయ ప్రతిష్ఠ వేడుకలు శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు పాస్టేట్ చైర్మన్ యోహాను బాబు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక అంద్రెయ ప్రతిష్ఠ వేడుకలను సంఘం పెద్దలు, యూత్, స్త్రీ, మైత్రి అందరూ జయప్రదం చేయాలని కోరారు.

12న వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరు మండల సమాఖ్య భవనం ఆవరణలో ఈనెల 12న వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం సుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ చేతుల మీదుగా పొదుపు మహిళలకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి పొదుపు గ్రూపు సభ్యులు హాజరు కావాలని కోరారు.

10న ఆర్‌బీకేల ప్రారంభోత్సవం



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

వెలుగోడు: మండలంలోని బోయరేవుల, రేగడగూడూరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఈ నెల 10వ తేదీన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభిస్తారని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ తెలిపారు. గురువారం ఆయన బోయరేవుల, రేగడగూడూరు రైతు భరోసా కేంద్ర భవనాలను పరిశీలించి, ప్రారంభోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. రైతులకు అన్నిరకాల సేవలందిస్తున్న ఆర్‌బీకే కేంద్రాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ సుధారాణి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది అర్పుత్, అప్సర,అలీ పాల్గొన్నారు.

తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 250 క్యూసెక్కుల నీరు



కేసీ కాల్వలో కొనసాగుతున్న నీటి సరఫరా

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 250 క్యూసెక్కుల సాగు నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి 156 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం రెండు పంపుల ద్వారా 490 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని రైతులు వినియోగించుకున్న అనంతరం లాకిన్స్‌లా వరకు 250 క్యూసెక్కులు చేరుతుండగా.. వీటిని తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు వదులుతున్నాట్లు వెల్లడించారు.

నేడు తంగడంచలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామస్తులు వైద్య శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకునేలా వలంటీర్లు, ఆశవర్కర్లు కృషి చేయాలన్నారు. వైద్యశిబిరంలో నిపుణులైన వైద్యులు ప్రజలకు 7రకాల పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

మహానంది: ఉత్తమ సేవలే ప్రజల్లో మంచి గుర్తింపుతీసుకొస్తాయని ఫ్యామిలీడాక్టర్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి అన్నారు. గాజులపల్లె ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకటరెడ్డి, స్టాఫ్ నర్సు నాగేంద్రమ్మలకు ఉత్తమ అవార్డులు రావడంతో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భగవాన్‌దాసు, శాంతిప్రియ, ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉచిత క్యూలైన్ల వద్ద పటిష్టంగా ఇనుప మెష్ ఏర్పాటు





ప్రధానాలయం వద్ద నిర్మించిన భారీ షెడ్లు



ఉచిత క్యూలైన్ వద్ద ఏర్పాటు చేస్తున్న ప్రాకారం



శివస్వాముల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు షురూ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను ప్రారంభించారు. ఇప్పటికే దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, దేవస్థాన అన్ని యూనిట్ విభాగాల అధికారులతో రెండుసార్లు సమీక్ష నిర్వహించి, ఉత్సవాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే లక్షలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ క్యూలైన్లు, క్షేత్రంలో పలుచోట్ల పార్కింగ్ ప్రదేశాలు, క్లాక్ రూమ్స్, ప్రధానాలయానికి ఎదురుగా భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు భారీ షెడ్లు, ఉచిత క్యూలైన్ వద్ద తాత్కాలిక క్యూలైన్, గార్డెనింగ్, బారీకేడ్లు తదితర పనులు ముమ్మరం చేశారు.



ప్రధానాలయానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన భారీ షెడ్లు

అన్నదాన పథకానికి రూ. 2 లక్షల విరాళం



విరాళాన్ని అందించిన దాత భాస్కర్‌ను సత్కరిస్తున్న పర్యవేక్షకురాలు హిమబిందు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి నల్గొండకు చెందిన మంచికంటి భాస్కర్ గురువారం రూ.1,01,116 విరాళం, అలాగే రంగారెడ్డి జిల్లాకు చెందిన కె.సూర్యనారాయణ రూ.1,00,116 విరాళాన్ని వేర్వేరుగా ఆలయ పర్యవేక్షకురాలు హిమబిందుకు అందించారు. ఆయా విరాళాలను అందించిన దాతలకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాన్ని లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

మాధవరంలో పోలీసు 'పల్లెనిద్ర'



పల్లెనిద్రలో మాట్లాడుతున్న ఎస్‌ఐ భూపాలుడు

వెలుగోడు: మండలంలోని మాధవరం గ్రామంలో శుక్రవారం రాత్రి ఎస్‌ఐ భూపాలుడు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామంలో ఏమైనా చిన్నచిన్న సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఎన్నికలపై ఎప్పటికప్పుడు ఇరుపార్టీల వారు తమను సంప్రదించాలని కోరారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందాం



డాక్టర్ దారా సుధీర్‌కు కార్యకర్తలను పరిచయం చేస్తున్న సచివాలయ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్
- పడమర ప్రాతకోటలో పర్యటన
- బ్రహ్మరథం పట్టిన కార్యకర్తలు

పగిడ్యాల: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుకొని జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ పిలుపునిచ్చారు. గురువారం పడమర ప్రాతకోటలో కార్యకర్తల ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. అభిమానులు గజమాలలతో సత్కరించి బాణాసంచా పేల్చి అభిమానం చాటుకున్నారు. గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఒక్కొక్కరుగా వచ్చి ఆయనను పరిచయం చేసుకుని అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకుందామని, సీఎం అమలు చేసిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గణపురం శ్రీనివాసరెడ్డి, మండల వైస్ ఎంపీపీ బోరెల్లి శ్యామలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్, నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, పగిడ్యాల సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, సింగిల్‌విండో డైరెక్టర్ దివాన్‌సాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం

పాములపాడు:గ్రామంలో ఇక నుంచి లో ఓల్టేజ్ సమస్య తలెత్తదని సర్పంచు వరప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండేదని, దీంతో లో ఓల్టేజి సమస్యతో విద్యుత్ అంతరాయం ఏర్పడేదన్నారు. ఈ సమస్యను జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డితో కలిసి ట్రాన్స్‌కో ఏఈ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు సామర్థ్యం పెంచుతూ 25 కేవీ చొప్పున నూతన ట్రాన్స్‌ఫార్మర్లు మూడింటిని ఏర్పాటు చేశారన్నారు. దీంతో గ్రామంలో విద్యుత్ సమస్య తలెత్తే పరిస్థితి గ్రామంలో ఉండదని వివరించారు. అంతకుమునుపు నూతన ట్రాన్స్‌ఫార్మర్లకు పూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, లైన్‌మెన్ అయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.



నూతన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సర్పంచు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి





ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ దాసు, హాజరైన అధికారులు, సిబ్బంది

- ఆత్మకూరు ఆర్డీఓ మిరియాల దాసు
- ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ స్థాయి అధికారులకు అవగాహన

నందికొట్కూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి మిరియాల దాసు అన్నారు. గురువారం పట్టణంలోని అల్వాల సత్రంలో నియోజకవర్గ స్థాయి రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఆరు మండలాలు, మున్సిపల్ పరిధిలోని సచివాలయాల ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసే వృద్ధులకు, చూపు మందగించిన వారికి 18 ఏళ్లు దాటిన కుటుంబ సభ్యులు తోడుగా వెళ్లి ఓటు వేయవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 5 గంటలలోపు క్యూలో నిలబడినవారు ఓటు వేయవచ్చని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తూచ తప్పకుండా పాటించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

వృద్ధులు, వికలాంగులు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం

40 శాతం వైకల్యం కలిగిన వారు, 80 ఏళ్ల వయస్సు కలిగి వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం ఉందని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన ఐదు రోజుల్లోపు బీఎల్‌వోలు ద్వారా ఇంటి నుంచి ఓటే వేసేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటికి బీఎల్‌వోలు వచ్చి ఓటు వేయించుకుంటారని స్పష్టం చేశారు. పోలింగ్ రోజు అధికారులు, బీఎల్‌వోలు తప్పని సరిగా వేళలు పాటించాలని ఆదేశించారు.

సమస్యాస్యత్మాక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

సమస్యత్మాక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఉంచుతామని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు, జిల్లా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాబు రాజేంద్రప్రసాద్, సీఐలు విజయభాస్కర్, ప్రకాష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు, ఎలక్షన్ డీటీలు, సెక్టార్ అధికారులు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామ సమీపంలోని మోకాళ్లకురువ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ రమేష్‌కుమార్ గురువారం తెలిపారు. సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి బుధవారం విషపూరిత ద్రావకాన్ని సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. మృతుడు ఎరుపు రంగు టీషర్ట్, ఆకుపచ్చ ప్యాంటు ధరించాడని తెలిపారు. మృతదేశాన్ని సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవపరీక్షలు నిర్వహించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతునికి సంబంధించి వివరాలు తెలిసిన వారు.. టూటౌన్ ఎస్‌ఐ సెల్ 9121101194కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలి

ఆత్మకూరు : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఇందిరానగర్, గరీబ్‌నగర్, అర్బన్‌కాలనీ, తదితర కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలోను, మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు పని చేయాలన్నారు. ఈనెల 18న అనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించనున్న సిద్ధం సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావాలన్నారు. బూత్ కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఆయా వార్డులో పర్యటించి ఓటర్లకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికంగా ఓట్లు వేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేసి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు పట్టణ వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, కౌన్సిలర్ రాజగోపాల్, ముర్తుజా, విజయచౌదరి, జయకృష్ణ, నాగరాజు, రమణ, మారబోతుల విజయ్, శ్రీనివాసరెడ్డి, రఫిక్ తదితరులు పల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పాభువనేశ్వరరెడ్డి

రగ్బీలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

మిడుతూరు: రగ్బీ రాష్ట్రస్థాయి క్రీడల్లో స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఎస్ఓ మాట్లాడుతూ రగ్బీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ 9 ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు విశాఖపట్టణం జీవీఎంసీ ఫుట్‌బాల్ స్టేడియంలో జరిగిందన్నారు. ఇందులో స్థానిక కేజీబీవీ ఎనిమిదో తరగతి విద్యార్థినులు శృతి, అక్షయ జిల్లా జట్టు తరపున పాల్గొని.. ప్రతిభ చూపి విజయానికి దోహదపడ్డారన్నారు. వీరిలో అక్షయ అనే విద్యార్థిని జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. జాతీయ స్థాయికి విద్యార్థిని గుజరాత్‌లోని గాంధీనగర్ నిర్వహించే నేషనల్ మీట్‌లో పాల్గొంటుందని తెలిపారు. రగ్బీ క్రీడలో శిక్షణ ఇచ్చిన పీఈటీ సుమలతను, విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.



రగ్బీ క్రీడలో ప్రతిభ చాటిన విద్యార్థినులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జూపాడుబంగ్లా: మండలకేంద్రానికి చెందిన మహబూబ్‌బాషా అనే వ్యక్తిని గురువారం తెల్లవారుజామున బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. తెల్లవారుజామున మసీదుకు వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తున్న మహబూబ్‌బాషాను వెనుకనుంచి గుర్తుతెలియని బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. గాయాలపాలైన అతన్ని చికిత్స నిమిత్తం హుటాహుటినా కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బాధితుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు గుర్తుతెలియని వాహనం ఆచూకీ కోసం యత్నిస్తున్నట్లు ఏఎస్ఐ మేరీ జయంతి తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పథకాలు

మహానంది: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తుండటంతో పాటు స్వయం ఉపాధికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోందని డీఆర్‌డీఏ నంద్యాల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం బుక్కాపురంలో పొదుపు మహిళా భవనంలో స్రవంతి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జూట్ కాటన్ బ్యాగ్‌ల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ కాటన్ బ్యాగ్‌ల తయారీతో మహిళలకు జీవనోపాధి కలగడంతో పాటు ఆర్థికంగా లాభాలు ఉంటాయన్నారు. మహానంది మండలంలో 90మంది పొదుపు మహిళలకు శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఆసక్తి కలిగిన వారికి నాబార్డు సహకారంతో యూనిట్లను నెలకొల్పేందుకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, ఎల్‌డీఎం రవీంద్రకుమార్, డీసీసీబీ డీజీఎం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

సచివాలయాల వారీగా రిజిస్ట్రేషన్ చేయించండి

కొత్తపల్లి: మండలంలో సచివాలయాల వారీగాలబ్ధిదారులకు చెందిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ చేయించాలని జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, గోకవరం, నందికుంట గ్రామ సచివాలయాలతో పాటు కొత్తపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయాల్లో సాంకేతిక లోపం కారణంగా జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచి పోయిందన్నారు. ఆ సమస్యను తొలగించేందుకు సిబ్బందితో కలసి అన్ని సచివాలయాలు సందర్శించి సమస్యను పరిష్కారం చేశామన్నారు. ప్రస్తుతం జగనన్న ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ అన్ని సచివాలయాల్లో ప్రారంభమైందని చెప్పారు. సబ్‌రిజిస్ట్రార్ ఆదినారాయణ, ఎంపీడీఓ జవహర్ బాబు, వైఎస్సార్‌సీపీ మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా తదితరులు ఉన్నారు.



ముసలిమడుగు సచివాలయంలో సమస్యపై ఆరా తీస్తున్న జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవ రెడ్డి

పంచాయతీ కార్యదర్శులు విధుల్లో ఉండాలి

మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో జగనన్న ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తప్పకుండా విధుల్లో ఉండాలని ఎంపీడీఓ జవహర్ బాబు సూచించారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని గువ్వలకుంట్ల సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

పాములపాడు: ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సరస్వతి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులచే సమావేశం నిర్వహించారు. మండలంలో ఇంటి స్థలాల లబ్ధిదారులు 2051 మంది ఉండగా, 747 మాత్రమే రిజిస్ట్రేషన్లు అయ్యాయన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

మహానంది : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శుక్రవారం మహానంది మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గాజులపల్లెలో ఉదయం గాజులపల్లె నుంచి బస్సాపురం వరకు నిర్మించనున్న రహదారికి శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం తిమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం బొల్లవరం గ్రామంలో సీసీ రోడ్లను ప్రారంభించనున్నారని వెల్లడించారు.

వర్గీకరణకు సైనికుల్లా పోరాడాలి

మహానంది: ఎస్సీ వర్గీకరణకు సైనికుల్లా పోరాడాలని ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల వెంకటసుబ్బన్న పిలుపునిచ్చారు. బండిఆత్మకూరు మండలంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్‌పీ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా బాలస్వామి మాదిగ, మాదిగ విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడిగా సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా నడిపి సోమన్న మాదిగలను ఎన్నుకున్నామన్నారు. వీరితో పాటు అధికార ప్రతినిధులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నట్లు వివరించారు.